ముస్తాబైన కోట

నేడు దోమకొండలో దసరా ఉత్సవాలు

న్యూస్‌టుడే, దోమకొండ




దోమకొండలోని కోటను దసరా ఉత్సవాలకు ముస్తాబు చేశారు. కోటను శుక్రవారం విద్యుద్దీపాలతో అలంకరించారు. నైజాం నిరంకుశ కాలం నుంచే ఇక్కడ దసరా ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నైజాం పాలనలో ఇబ్బందులు పడ్డ దోమకొండ ప్రజలు స్వాతంత్ర్యం రాక కోసం అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ ఇక్కడ మువ్వన్నెల జెండాను ఎగురవేయటానికి స్థానికులు నిజాం పాలకులకు భయపడేది. దోమకొండలో 1947 సెప్టెంబరు 8న ఇక్కడి పాలకులకు తెలియకుండా యువకులు బురుజుపై జెండా ఎగురవేశారు. దీనికి అప్పట్లో కొందరు యువకులు జైలు పాలయ్యారు. నాటి నుంచి ప్రతి దసరా రోజున జాతీయ జెండాను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవంలో భాగంగా బురుజు వద్ద ఆయుధ పూజ చేస్తారు. అనంతరం జమ్మి వృక్షానికి పూజ చేసి, చాముండేశ్వరీ ఆలయానికి ఎదుర్కొని వెళ్తారు. ఈ ఏడాది సైతం ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మహిషాసురమర్దినిగా చాముండేశ్వరీదేవి



దోమకొండలోని చాముండేశ్వరీ దేవి శుక్రవారం ఉదయం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో మహర్నవమి సందర్భంగా దిక్పాలక, క్షేత్రపాలక బలులు, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం కుమారి సుహాసిని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సిద్ధారెడ్డి, వెంకటేశం, ఎల్లం, రమేశ్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, దోమకొండ



జుక్కల్‌లో తూకం వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట, నాయకులు

కేంద్రాల్లోనే సోయా విక్రయించాలి

జుక్కల్, న్యూస్‌టుడే: దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే సోయా విక్రయించాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట రైతులను కోరారు. శుక్రవారం జుక్కల్‌లో ఆయన సోయా కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోళ్లలో రైతులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా.. తన దృష్టికి తేవాలని, తక్షణ పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. వెంట సొసైటీ ఛైర్మన్ శివానంద్, నాయకులు దాదారావు పాటిల్, సాయాగౌడ్, ఉమకాంత్ దేశాయ్, హన్మాండ్లు, ఇమ్రాన్ ఖాన్, పడంపల్లి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాట యోధుడు కొమురయ్య

కామారెడ్డి గ్రామీణం : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో సామాజిక చైతన్యం రగిలించిన సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి గ్రామీణం మండలంలోని ఇస్రోజివాడి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొమురయ్య విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

విద్యుత్తుశాఖ ఉద్యోగులకు బదిలీలు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ ఉద్యోగులకు శుక్రవారం రాత్రి బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత విడుదలైన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7వ తేదీన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. వివిధ కారణాలతో ప్రక్రియను నిలిపివేశారు. ఎట్టకేలకు శుక్రవారం రాత్రి వరకు బదిలీలు పూర్తిచేసి జాబితాలను విడుదల చేయాలని ఎస్ఈ, డీఈలకు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నెల 12వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

వరద గేట్ల మూసివేత

నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గిపోవడంతో ప్రధాన గేట్ల నుంచి నీటి విడుదలను నిలిపివేసినట్లు జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి సాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 4000 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరడంతో వరద గేట్లను మూసివేశామన్నారు. జలవనరుల శాఖ గేట్ల నుంచి వానాకాలం పంటల సాగుకోసం 1000 క్యూసెక్కులు సాగర్ ప్రధాన కాలువలోకి విడుదల కొనసాగుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404 అడుగుల (17.571 టీఎంసీలు) నిల్వ ఉందని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తున్న ముఠా గుట్టు రట్టు ...12లో

రైతు ఖాతాలో..

48 గంటల్లోపే ధాన్యం నగదు

ఈనాడు, కామారెడ్డి

● శ్రీనివాస్‌రెడ్డి, అదనపు పాలనాధికారి, కామారెడ్డి

ముఖాముఖి



ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు మండల, జిల్లా స్థాయిల్లో రెవెన్యూ, వ్యవసాయ, రవాణా శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించి పర్యవేక్షణ చేయాలని నిర్ణయించినట్లు అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రైసు మిల్లులో ధాన్యం అన్‌లోడ్ అయి ట్రక్ షీట్ జారీ అయిన 48 గంటల్లోపే రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమజేసేలా కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న నేపథ్యంలో ధాన్యం సేకరణకు చేస్తున్న ఏర్పాట్లపై ఈనాడు నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. వారి మాటల్లోనే..

49 రైసుమిల్లులకు కేటాయింపులు రద్దు

సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయిపడిన 49 రైసుమిల్లులకు ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కేటాయింపులు నిలిపివేశాం. ప్రస్తుతం జిల్లాలో 152 మిల్లులకు ధాన్యం కేటాయించాలని నిర్ణయించాం. కలెక్టర్ ఆధ్వర్యంలో మిల్లర్లతో పాటు వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, సహకార, పౌరసరఫరాల శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి సేకరణకు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నాం.

ఇప్పటికే అధికారులకు శిక్షణ

సన్నధాన్యం ఎక్కడ సాగయిందో వివరాలను వ్యవసాయశాఖ నమోదు చేసింది. దొడ్డు, సన్నరకాలను గుర్తించడంపై వ్యవసాయ శాఖ ఏఈవోలకు, సహకార శాఖ సీఈవోలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇప్పించాం. ప్రతీ కొనుగోలు కేంద్రానికి గ్రేన్ కాలిఫర్ యంత్రాలను తెప్పిస్తున్నాం. ఈ యంత్రంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సన్నరకం ధాన్యాన్ని నిర్ధారిస్తాం.

రవాణా మార్గాలు పెంపు

★ బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మొత్తం విస్తీర్ణంలో సన్నరకం ధాన్యమే సాగు చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని 63 గ్రామాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. మిగిలిన 356 కేంద్రాల్లో సన్న, దొడ్డురకాల ధాన్యం సేకరణకు వేర్వేరుగా కాంటాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రస్తుత సీజన్‌లో 6.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం. సేకరించిన ధాన్యం మిల్లుల్లో త్వరితగతిన అన్‌లోడ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ధాన్యం రవాణాకు లారీల కొరత ఏర్పడొద్దని ట్రాన్స్‌పోర్టర్ల సంఖ్యను ఏడు నుంచి పదికి పెంచాం.

బోనస్ చెల్లింపునకు ప్రత్యేక విధానం

సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లించేందుకు ప్రత్యేక విధానం అమలు చేయనున్నాం. మొదట రైతు ఖాతాలో కనీస మద్దతు ధర చెల్లించనున్నారు. ఆ తర్వాత నిర్దేశించిన మేరకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నారు.

లింగ నిర్ధారణ చేస్తున్న ముఠా గుట్టు రట్టు

● కామారెడ్డిలో యంత్రం, సామగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు ● అయిదుగురి రిమాండ్.. కొనసాగుతున్న విచారణ

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: రెండేళ్లుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠా గుట్టును కామారెడ్డి జిల్లా పోలీసులు రట్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సింధుశర్మ వివరాలు వెల్లడించారు. రాజంపేట మండలకేంద్రానికి చెందిన బల్ల రవీందర్ ఇంట్లో సీసీఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు గురువారం ఆకస్మిక దాడి చేశారు. ఆ సమయంలో రవీందర్ సిద్దిపేట జిల్లా వర్గల్ మండలానికి చెందిన ఓ గర్భిణికి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇతడికి రాజంపేటలోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, కామారెడ్డిలో గతంలో సీజ్ చేసిన కౌసల్య ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రాల్లో పనిచేసిన అనుభవం ఉంది. కౌసల్య ఆసుపత్రి 2021లో మూతపడడంతో రవీందర్ అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలనే దురాలోచన చేశాడు.

అంతర్జాలంలో వివరాలు సేకరించి..

అంతర్జాలంలో అల్ట్రాసౌండ్ నిర్ధారణ యంత్రం కోసం రవీందర్ వివరాలు తెలుసుకున్నాడు. యంత్రం కొనుగోలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ అర్బన్ ప్రాంతంలోని గాంధీనగర్ (కుదుస్‌నగర్)కు చెందిన పాత యంత్రాలను అమ్మే 'సామ్ మెడికల్ సిస్టమ్' డైరెక్టర్ పోతల సామ్‌సన్‌ను సంప్రదించాడు. రవీందర్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సదరు యంత్రాన్ని సామ్‌సన్ ఎక్కువ ధరకు విక్రయించాడు. ఈ యంత్రాన్ని అమ్మేందుకు కృష్ణా జిల్లా చింతలపూడి అప్పారం వీధి ప్రకాష్ నగర్ సుందరయ్యనగర్‌కు చెందిన చింతలపూడి దుర్గాప్రసాద్ సహకరించాడు. ఇలా కొనుగోలు చేసిన యంత్రంతో రవీందర్ రెండేళ్లుగా తన ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడు.

సహకరించిన ఆర్ఎంపీలు

రవీందర్‌కు ఆర్ఎంపీలు సహకరించారు. ఇలా సహకరించిన రామారెడ్డి మండలం గిద్దలో ఆర్ఎంపీగా పనిచేస్తున్న బోయిని యాదగిరి (కామారెడ్డి పంచముఖీ హనుమాన్‌కాలనీ నివాసి), దోమకొండ మండలం గొట్టిముక్కులలో ఆర్ఎంపీగా పనిచేస్తున్న బక్కి ప్రవీన్‌కుమార్(కామారెడ్డి మండలం నర్సన్నపల్లి నివాసి)లను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. రవీందర్ వినియోగించిన అల్ట్రాసౌండ్ యంత్రం, దానికి ఉపకరించే కేబుళ్లు, చరవాణిని జప్తు చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసును విచారిస్తున్నామని, ఇంకా ఎవరి పాత్ర అయినా ఉన్నట్లు తేలితే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. రవీందర్ వద్ద లింగ నిర్ధారణ పరీక్షల కోసం ఏయే ఆసుపత్రుల నుంచి ప్రతిపాదించారనే కోణంలో సైతం విచారణ కొనసాగుతోందన్నారు. సమావేశంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ, చిత్రంలో అల్ట్రాసౌండ్ నిర్ధారణ యంత్రం

నేడు గర్గుల్‌లో దసరా సంబరాలు

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: గర్గుల్ గ్రామం ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం సాయంత్రం దసరా సంబరాలు జరగనున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ చింతల రవితేజ గౌడ్ తెలిపారు. రావణ దహనంతో పాటు కళాకారుల నృత్యాలు, జబర్దస్త్ బృందం వారి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంబరాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు భీమ్‌రెడ్డి, నరసింహులు, రమేష్ గౌడ్, నరేష్ రెడ్డి, రాజు, స్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రావణ దహన స్థలం వద్ద గర్గుల్ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

నిర్మాణ పనుల పరిశీలన

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని మాతాశిశు ఆసుపత్రిలో కొనసాగుతున్న షెడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు లేకుండా షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు ఎజాజ్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులకు మాసపత్రిక అందజేస్తున్న టీపీటీఎఫ్ ప్రతినిధులు

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని టీపీటీఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం రిపోర్ట్ చేయడానికి వచ్చిన ఉపాధ్యాయులకు వారు టీపీటీఎఫ్ మాసపత్రికలు, కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధ్యాయ నియామకాల్లో ఎలాంటి జాప్యం లేకుండా ఉద్యోగాలు భర్తీ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, జిల్లా కార్యదర్శి లింగం, లక్ష్మి, నళినీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేరుకుపోతున్న

అప్పీళ్లు- ఫిర్యాదులు

● పరిష్కారంపై దృష్టేది..?

● నేడు స.హ చట్టం అమలు దినోత్సవం

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



అవినీతిని అంతమొందించేందుకు తెచ్చిన సమాచార హక్కు చట్టం అమలుపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు. ఉమ్మడి జిల్లాలో స.హ చట్టం కింద దరఖాస్తు చేసిన అనేక ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. వందలాది అప్పీళ్లు-ఫిర్యాదులు అపరిష్కృతంగానే మిగిలాయి. స.హ కమిషనర్లు లేక వ్యవస్థ గాడి తప్పుతోంది. నేడు (శనివారం) జాతీయ స.హ చట్టం అమలు దినోత్సవం సందర్భంగా కథనం.

జిల్లా	అప్పీళ్లు	ఫిర్యాదులు
నిజామాబాద్	109	74
కామారెడ్డి	162	57

402 దరఖాస్తులు అపరిష్కృతం

సమాచారం తెలుసుకోవడం పౌరుల ప్రాథమిక విధి. నిర్దిష్ట గడువులోగా సమాచారం ఇవ్వకుంటే పై అధికారికి అప్పీలు చేసుకునే వీలుంది. ఉమ్మడి జిల్లా నుంచి 402 అప్పీళ్లు, ఫిర్యాదులు అపరిష్కృతంగానే ఉన్నాయి. సమాచార కమిషన్‌లో కమిషనర్లు లేక సమస్య నెలకొంది. ఏళ్ల నుంచి సమాచారం ఇచ్చేవారే కరవయ్యారు. స.హ చట్టం అమలుకు జిల్లాల్లో అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

కమిటీల ఏర్పాటు లేక

సాధారణ పరిపాలనశాఖ 2013 సంవత్సరంలో ప్రతి జిల్లాల అధికారులు, స.హ చట్టం ఉద్యమకారులతో కలిసి ప్రభుత్వ కమిటీ వేసి అమలు తీరును పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఏ ఒక్క కమిటీ వేసిన దాఖలాలు లేవు. మూడు నెలలకోసారి జిల్లా నోడల్ అధికారి అయిన సంయుక్త పాలనాధికారితో స.హ చట్టం అమలుతీరుపై సమీక్షలు నిర్వహించాలి. రెండు జిల్లాల్లో సమీక్షలు జరిగిన సందర్భాలు లేవు. స.హ చట్టం అమలుకు పకడ్బందీ ప్రణాళిక అవసరమని పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రతినిధి అంకం నరేశ్ వెల్లడించారు. అప్పీళ్లు, ఫిర్యాదులపై దృష్టి పెట్టాలన్నారు.

అంతర్ జిల్లా పోటీలకు ఎంపిక

నిజామాబాద్ క్రీడావిభాగం : హైదరాబాద్‌లో నిర్వహించే సీనియర్ పురుషుల అంతర్ జిల్లా హాకీ టోర్నమెంటులో ప్రాతినిధ్యం వహించడానికి జిల్లా జట్టును ఆర్మూర్‌లో ఈ నెల 14న ఉదయం 7 గంటలకు ఎంపిక చేయనున్నామని జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, రమణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హాకీ ఇండియా ఐడీ నంబరు ఉన్నవారే ఎంపికలకు అర్హులన్నారు. సంఘం కోశాధికారి సురేందర్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ ఆరీఫ్, సభ్యుడు నాగేశ్‌కు రిపోర్టు చేయాలన్నారు.



పగలే వెలుగులు

ఈ హైమాస్ట్ దీపం కామారెడ్డి కొత్త బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసింది. ఈ దీపం గత నెల రోజుల నుంచి ఉదయం, రాత్రి అని తేడా లేకుండా వెలుగుతూనే ఉంది. ఉదయం వేళల్లో దీపాలను బంద్ చేయడం లేదు. దీంతో పగటిపూట విద్యుత్తు వృథా అవుతుంది.

– న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్ — ఈనాడు సినిమాలు

వెట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15
విశ్వం 11.00 2.00 6.00 9.00

వీ సినిమాస్

దేవర 10.50 2.15 5.50 9.30

ఏషియన్ దర్శన్

మార్టిన్ 11.00 6.00
మా నాన్న సూపర్ హీరో 2.00 9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో చెత్త పేరుకుపోయింది. - **శ్రీనివాస్, అంబేద్కర్ నగర్**

చెత్త తొలగేలా చర్యలు చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



జిల్లా కేంద్రంలోని రుక్మిణికుంటలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **సంజయ్, రుక్మిణి కుంట**

సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



బాన్సువాడ వాసవీ కాలనీలో మురుగు కాల్వల వెంట పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. - **రవి, బాన్సువాడ**

ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించి సమస్యను పరిష్కరింపజేశారు.

పిట్లం మండల కేంద్రం నుంచి కల్హేర్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు పారవేస్తున్నారు. దుర్గంధం వస్తోంది. **నవీన్, స్థానికుడు**

వ్యర్థాలు రోడ్డు పక్కన వేయకుండా చర్యలు చేపడుతాం. **యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం, పిట్లం


గాంధారి : వెంకటాపూర్‌లో...


కామారెడ్డిలో వివేకానంద దుర్గామండలి వద్ద అమ్మవారికి రుద్రాలతో అలంకరణ


కామారెడ్డిలో...


జిల్లా కేంద్రం: శారదాంబ ఆలయంలో ఉగ్ర రూపంలో ..


జుక్కల్: అష్టభుజ ఎల్లమ్మ విగ్రహానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు


కామారెడ్డి: మహబల్ సేన దుర్గామాత వద్ద ..

పూజలు.. అర్చనలు

జిల్లాలో దుర్గామండపాల్లో శుక్రవారం అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. పలు మండపాల్లో సామూహిక కుంకుమార్చనలు, అన్నదానాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

- న్యూస్‌టుడే, బృందం


జంగంపల్లి గ్రామంలో పూజల్లో చిన్నారులు


దోమకొండ: అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు దీరిన భక్తులు


దేశాయ్‌పేట్: సబ్‌కలెక్టర్ కిరణ్మయి దంపతులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు


మహ్మద్‌నగర్: నర్వలో శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి హాజరైన దఫేదార్ రాజు


కామారెడ్డి: భారత్‌రోడ్డులో ..


బీర్కూర్‌లో..


నస్రుల్లాబాద్: మీర్జాపూర్‌లో..


నాగిరెడ్డిపేట్: తాండూరులో


జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో


దోమకొండ: ముత్యంపేటలో..


బీబీపేటలో 51 రకాల నైవేద్యాలు


బాన్సువాడ పట్టణంలో..


కామారెడ్డి: అశోక్‌నగర్ రైల్వేగేటు సమీపంలో ..


పిట్లం ...ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో...


కారేగావ్‌లో ..


పిట్లం అయ్యప్ప ఆలయంలో


ఎంగ్రియాల్‌లో ..

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

భిక్కనూరు: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్యకు టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం రూ.5000 ఆర్థిక సాయం ఇచ్చారు. శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్‌లో దసరా పండుగ సందర్భంగా శుక్రవారం బీర్కూర్ మున్నూరుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 12 మంది అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచి గంగారాం, సంఘం అధ్యక్షుడు అంబయ్య, విఠల్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

ఏడు చరవాణుల స్వాధీనం

భిక్కనూరు: వివిధ కారణాలతో బాధితులు పోగొట్టుకున్న చరవాణులను పోలీసులు 'సీఈఐఆర్' పోర్టల్ ద్వారా గుర్తించారు. శుక్రవారం ఏడు చరవాణులను బాధితులకు అందజేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు.


చరవాణులను అందజేస్తున్న పోలీసులు

వైభవంగా రథోత్సవం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం దుర్గా భవానీ మాలధారుల ఆధ్వర్యంలో శుక్రవారం రథోత్సవం, పాదయాత్ర వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, కాశీ దండి స్వామీజీ జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. పెద్ద ఎత్తున హాజరైన మాలధారులతో కోటదుర్గ ఆలయం నుంచి పాత బాన్సువాడ కనకదుర్గ ఆలయం వరకు నృత్యాలు, అమ్మవారి గీతాలు ఆలపిస్తూ వెళ్లారు. కార్యక్రమంలో బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్, లింగం తదితరులున్నారు.


జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బిచ్కుంద, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ అవరణలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మద్దతు ధర క్వింటాకు రూ.4,892 ప్రకటించిందన్నారు. సొసైటీ ఛైర్మన్ నాల్చర్‌బాలు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

గాంధారి, న్యూస్‌టుడే: గుర్జాల్ తండాకు చెందిన సర్దార్, జీవన్‌లు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ.. ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కిందరూ.60వేలు, రూ.26వేలు విలువ గల చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచి దశరథ్, సొసైటీ వైస్ ఛైర్మన్ ఉదల్‌సింగ్, తండా పార్టీ అధ్యక్షులు జగదీష్, నాయకులు నారాయణ, నాగరాజు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గాంధారి, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ గాంధారి కార్యదర్శిగా సరాఫ్ కిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు కమ్మరి సాయిలు, మధు, రాములు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శన



నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రులు, దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మైలారంలో శుక్రవారం ప్రదర్శించిన ఎల్లమ్మ నాటకం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వెంకటి, రాములు, మహేందర్, సాయిలు, నాగయ్య, పోశెట్టి ఉన్నారు

మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కేటాయించాలి

నిజాంసాగర్, న్యూస్‌టుడే: మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కేటాయించాలని కొందరు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంసాగర్ మండల కేంద్రానికి చెందిన గైని గోపాల్ (ఎస్సీ) గణితం స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 55వ ర్యాంకు సాధించాడు. ఇతని కంటే ముందు వరుసలో 26, 36 ర్యాంకులు సాధించిన ఉద్యోగులు గణితం మరియు ఫిజిక్స్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు. వారిద్దరు ఫిజిక్స్ మాత్రమే ఎంపిక చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గణితం విభాగంలో ఖాళీని చూపకపోవడంతో గోపాల్‌కు ఉద్యోగం రాలేదు. ఖాళీగా చూపిస్తే ఉద్యోగం తనకే వస్తుందని బాధితుడు కంటతడి పెట్టాడు. ఈ విషయంపై న్యూస్‌టుడే జిల్లా విద్యాశాఖ అధికారి రాజును వివరణ కోరగా..డీఎస్సీ కార్యాలయానికి విల్లింగ్, నాట్ విల్లింగ్ వివరాల నివేదికను పంపామని తర్వాత స్థానంలో ఉన్న వారికి సోమవారం తుది ఫలితాలు వస్తాయని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

సదాశివనగర్, న్యూస్‌టుడే : డీఎస్సీలో ప్రతిభ చూపి ఉపాధ్యాయుడిగా ఎన్నికైన నవీన్‌ను జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేశ్వర్‌రావు శుక్రవారం సన్మానించారు. సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన నవీన్ చిన్నప్పటినుంచి కష్టపడి చదువుకోవడంతో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యాడని కొనియాడారు. కార్యక్రమంలో గాంధారి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సత్యంరావు, గంగారెడ్డి, భూంరావు, గంగారెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

జుక్కల్, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణించాలని ఏఎస్సై ప్రభాకర్ అన్నారు. పెద్దఎడ్గిలోని స్వామి వివేకానంద స్టేడియంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. యువకులు ఏఎస్సైని సన్మానించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలను అందజేశారు. వెంట నిర్వాహకులు సందీప్, చరణ్, ఏబీవీపీ నాయకుడు వాగ్మరే బాల్‌రాజ్, బాలాజీ, ఖాసీం, తదితరులు ఉన్నారు.


ఏఎస్సై ప్రభాకర్‌ను సన్మానిస్తున్న యువకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


గాంధారి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలోని పెద్దవాగు వంతెన వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలంలోని జనుగామకు చెందిన గాండ సురేష్ ద్విచక్ర వాహనంపై గాంధారికి పని నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొని సురేష్ తలకు గాయాలతో పాటు కాలు విరిగిందని 108 పైలట్ ప్రకాష్ తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధారి ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సురేష్ పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు వేద విహార్‌లో నివాసం ఉంటున్న చర్చి ఫాదర్ సుధీర్ కుమార్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గత ఏడాదిగా వేద విహార్‌లో అద్దెకు ఉంటున్న సుధీర్‌కుమార్ గురువారం ఉదయం తన స్వగ్రామం నిర్మల్ జిల్లా లక్ష్మణచందాకు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని 3 తులాల బంగారం, 15 తులాల వెండి అపహరణకు గురైందని బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

ఈనాడు సినిమా


చిరంజీవి

విశ్వంభర రాకతో

అభిమానులు, సినీ ప్రియుల దసరా వేడుకల్లో 'విశ్వంభర' ఓ భాగం కానుంది. చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' టీజర్ శనివారం విడుదలవుతోంది. 'అందరూ ఎదురు చూస్తున్న అతని రాక ఓ వేడుక' అంటూ ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. వశిష్ఠ దర్శకత్వంలో, యు.వి.క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. త్రిష నాయికగా నటిస్తోన్న ఈ సినిమాని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విడుదల తేదీపై నేడు చిత్రబృందం స్పష్టతనిచ్చే అవకాశాలున్నాయి.


బాలకృష్ణ


ప్రభాస్


అల్లు అర్జున్


ఎన్టీఆర్


నాని

సల్మాన్ తిరస్కరిస్తే.. షారుక్‌కు స్టార్‌డమ్

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రం


వెంకీ అట్లూరి, నాగవంశీ

'లక్కీ భాస్కర్‌గా దీపావళి బరిలో సందడి చేయనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన హీరోగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని వెంకీ అట్లూరి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "నాకు తెలిసి ఇంత వరకు బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రమేదీ రాలేదు. అందులో చాలా రకాల కుంభకోణాలు జరుగుతుంటాయి. ఈ సినిమా అదే నేపథ్యంతో ఉంటుంది. డబ్బు సంపాదనపై ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం తప్పక నచ్చుతుంది" అన్నారు. "ఈ నెల 26, 27 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణల్లో విడుదల ముందస్తు వేడుకలు నిర్వహించనున్నాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

శ్రుతి.. ది డెవిల్ ఈజ్ వెయిటింగ్!


శ్రుతి హాసన్

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రేయా, శశాంక్, అభిరామి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నటి శ్రుతిహాసన్ పాడిన "ది డెవిల్ ఈజ్ వెయిటింగ్" అనే గీతాన్ని హీరో కమల్ హాసన్ విడుదల చేశారు. ఈ పాటకు డి.ఇమ్మాన్ స్వరాలు సమకూర్చగా.. దర్శకుడు లోకేశ్ సాహిత్యమందించారు.

అంచనాలు పెంచుతున్న విజయ మంత్రం

వరుస హిట్లతో జోరు చూపిస్తున్న తారలు

పరాజయం చెప్పే పాఠం విలువైనదైనా.. ప్రతిభను చాటి చెప్పి ప్రపంచం ముందు హీరోగా నిలబెట్టేది విజయమే. అందుకే జీవితంలో జయాపజయాలు సాధారణమే అయినా ప్రతి ఒక్కరూ విజయం వెంటే పరుగులు తీస్తుంటారు. అయితే ఇతర రంగాలతో పోల్చితే చిత్ర పరిశ్రమలో ఈ విజయాలే సినీ కెరీర్‌కు కీలకంగా నిలుస్తుంటాయి. సినిమా సినిమాకీ మార్కెట్ లెక్కలు పెంచుకుంటూ పోవాలంటే నిలకడగా విజయాల బాటలో పయనం సాగించాల్సిందే. అదే ఇటు తారలకు.. అటు చిత్రసీమకూ శ్రీరామరక్ష. ఇప్పుడిలా వరస విజయాలతో దూసుకుపోతూ తదుపరి చిత్రాల విషయంలో అంచనాల్ని అంతకంతకూ పెంచేస్తున్న హీరోలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి సందర్భంగా ఆ తారల చిత్ర విశేషాలివీ..!

కథానాయకులు వరుస విజయాలతో జోరు చూపిస్తుంటే సినీప్రియుల్లోనూ.. మార్కెట్ వర్గాల్లోనూ ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. కాకపోతే ఈ పరిశ్రమలో నిలకడగా జైత్ర యాత్ర సాగించడం కత్తిమీద సాము లాంటి వ్యవహారమే. అలాంటిది ఈ మధ్య కాలంలో అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు పలువురు వరుస విజయాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. దీని కోసం వాళ్లు తెర వెనుక తమదైన రీతిలో శ్రమిస్తున్నారు. ఆలస్యమైనా సరే కథల ఎంపికలో ఆచితూచి అడుగులేయడం.. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా కొత్తదనానికి ప్రాధాన్యత ఇవ్వడం.. అన్నీ చక్కగా కుదిరాకే ఆయా ప్రాజెక్ట్ కోసం రంగంలోకి దిగడం.. వాళ్లు చేస్తున్న పని. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ గత నాలుగేళ్లుగా నిర్విరామంగా జైత్ర యాత్ర కొనసాగిస్తున్నారు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న ఆయన.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు ఫుల్ జోష్‌ను అందించారు. దీంతో ప్రస్తుతం ఆయన నుంచి రానున్న 'ఎన్‌బీకె 109' (వర్కింగ్ టైటిల్)పైనా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. 'బాహుబలి' విజయాల తర్వాత వరుస పరాజయాలతో సతమతమైన ప్రభాస్ గతేడాది 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్'తో తిరిగి హిట్ ట్రాక్ ఎక్కిన సంగతి తెలిసిందే. ఇది బాక్సాఫీస్ ముందు దాదాపు రూ.700కోట్ల వసూళ్లు సాధించి సత్తా చాటగా.. ఈ ఏడాది 'కల్కి 2898ఎ.డి'తో దాదాపు రూ.1150కోట్ల పైచిలుకు వసూళ్లు కొల్లగొట్టి గత రికార్డును తిరగరాశారు ప్రభాస్. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'రాజాసాబ్'పై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. మారుతి తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌తో ప్రభాస్ హ్యాట్రిక్ కొడతారా లేదా? తెలియాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 10వరకు వేచి చూడక తప్పదు. ఈసారి దీన్ని పాన్ వరల్డ్ సినిమాగా విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇది వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు అందుకుంటుందన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

జైత్ర యాత్ర సాగనీ..

చిత్రసీమలో దశాబ్ద కాలం పాటు నిలకడగా జైత్ర యాత్ర సాగించడమన్నది అరుదుగా కనిపిస్తుంటుంది. ఇప్పుడలాంటి ఘనతకు అడుగు దూరంలో ఉన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. 2015లో 'టెంపర్'తో మొదలైన తారక్ జైత్ర యాత్ర 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ', 'అరవింద సమేత..', 'ఆర్ఆర్ఆర్' విజయాలతో జోరుగా సాగిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'దేవర: పార్ట్ 1'తో మరోసారి బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం వసూళ్ల పరంగా రూ.500కోట్ల మైలురాయికి చేరువైంది. ఇక వచ్చే ఏడాది ఎన్టీఆర్ నుంచి 'వార్ 2' వచ్చే అవకాశముంది. హృతిక్‌తో కలిసి చేస్తున్న ఈ మల్టీస్టారర్‌పై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. ఇది కూడా విజయవంతమైతే దశాబ్ద కాలం పాటు నిర్విరామంగా జైత్ర యాత్ర సాగించిన హీరోగా నిలుస్తారు తారక్. రాశి కంటే వాశి ముఖ్యమని నమ్ముతూ.. ఆలస్యమైనా సరే సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులేస్తూ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. 'అల.. వైకుంఠపురములో'తో ఫ్లాప్‌లకు చెక్ చెప్పిన ఆయన ఆ తర్వాత 'పుష్ప: ది రైజ్'తో ఏకంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'పుష్ప 2: ది రూల్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. ఓవైపు సినిమాల విషయంలో వేగం చూపిస్తూనే.. మరోవైపు విజయాల పరంగానూ దూకుడు చూపిస్తున్నారు కథానాయకుడు నాని. గతేడాది 'దసరా', 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ ఏడాది 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ పూర్తి చేశారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి చిత్రాలపైనా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన ఓవైపు 'హిట్ 3'ని పూర్తి చేస్తూనే.. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యువ హీరోలు అడివి శేష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ కూడా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.

ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదంటున్నారు


వేణు, శ్రీను వైట్ల, గోపీచంద్, కావ్య


'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. "మేము ఏదైతే నమ్మి ఈ చిత్రం చేశామో దానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అన్నారు. "ఈ చిత్ర కథను.. అందులోని వినోదాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. సినిమా ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదని చెప్పడం ఆనందాన్నిస్తోంది" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో కావ్య, వేణు దోనేపూడి తదితరులు పాల్గొన్నారు.

విజయోభవ

నేడు విజయ దశమి

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

దసరా.. పది తలల రావణుడి సంహారం. విజయదశమి.. చెడుపై మంచి సాధించిన విజయం. పేర్లు వేరైనా పండగ అర్థం ఒకటే. మంచికి లభించిన విజయం. సమాజాన్ని వణికిస్తున్న రావణుడు, మహిషాసురుడు.. అనే రాక్షసులను శ్రీరాముడు, దేవీ మాత సంహరించి విముక్తి ప్రసాదించారు. వారి రాక్షస స్వభావమే వారి పతనానికి కారణమైంది. వర్తమానంలోనూ మనిషి చర్యలు దారి తప్పుతున్నాయనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని గుణాలను దూరం చేసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలు సరిచూసుకుని.. లోపాలుంటే సవరించుకోవడం, సరిగా ఉంటే మరింత మెరుగ్గా జీవించడానికి ప్రయత్నించడం అవసరం. ఆ అంశాలు ఏంటో సమీక్షించుకుని విజయదశమి స్ఫూర్తితో విజయం వైపు సాగుదాం.



వ్యక్తిగత జీవితం..


ఆర్థికం



సమాజంలో జరిగే నేరాల్లో ఆర్థికపరమైన నేపథ్యం ఉన్నవే ఎక్కువ. అందుకు అత్యాశ, దుబారా వంటివి కారణమవుతున్నాయి. డబ్బు కోసం ఆరాటపడే క్రమంలో ఆత్మహత్యలు, హత్యలకు పాల్పడి వ్యక్తిగత జీవితాన్ని దుర్భరం చేసుకుంటున్నారు. ఆది నుంచి న్యాయబద్ధంగా వచ్చే ఆదాయాన్ని సమర్థంగా వినియోగించుకునే ప్రణాళికలు రూపొందించుకుంటే జీవితానికి ఆర్థిక భరోసా లభిస్తుంది.

2023 ఏడాదిలో..
- ★ ఆత్మహత్యలు : 345
- ★ ఆస్తి సంబంధిత తగాదాలు : 1212

ఆరోగ్యం



ప్రస్తుతం ఎక్కువ కుటుంబాల్లో ఎవరో ఒకరు ఏదో ఒక అనారోగ్య సమస్య ఎదుర్కొంటున్నారనే వాదన ఉంది. ఈ సమస్యకు కారణం ఏదైనా... మన జీవన విధానమే ప్రధానమని నిపుణుల అభిప్రాయం. శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లు వ్యాధులబారిన పడటానికి కారణమవుతున్నాయని చెబుతున్నారు. సమతుల ఆహారం, సరిపడా నిద్ర, శారీరక శ్రమతో ఆరోగ్యకర జీవితం సాగించాలి.

జీవనశైలి వ్యాధులు..

వ్యాధి	నిజామాబాద్	కామారెడ్డి
రక్తపోటు	75,068	68,752
మధుమేహం	34,476	44,654

నిర్లక్ష్యం



వ్యక్తిగత, కుటుంబం, సమాజంపై నిర్లక్ష్య ధోరణి చిక్కులకు కారణమవుతుంది. కుటుంబ బాధ్యతల నిర్వహణతో పాటు సమాజంలో విలువలతో కూడిన వ్యక్తిగా జీవిస్తే ఉత్తమం. లేదంటే సమాజంలో వ్యక్తిగతంగా నిర్లక్ష్యానికి గురై ఒంటరిగా మారుతారు.

వ్యసనం

మద్యం, పాన్‌మసాలా, డ్రగ్స్, కల్తీ కల్లు, గంజాయి, అశ్లీల చిత్రాల వీక్షణ. ఇదీ ఇప్పుడు సమాజంలో వినిపించే వ్యసనాల జాబితా. వీటికి బానిసకావడంతో మనిషి తన సహజ ప్రవర్తన మర్చిపోయి భిన్నంగా వ్యవహరిస్తున్నాడు. వీటికి బానిసలైన వారు తదుపరి నేరస్థులుగా మారుతున్నారు. చోరీలు, అత్యాచారం, హత్య వంటి నేరాలకు వ్యసనాలు కారణమవుతున్నాయి. ఈ వ్యసనాలకు దూరంగా ఉండటం మేలు.

★ మహిళలపై అఘాయిత్యాలు : 388


★ నిజామాబాద్ జిల్లా వివరాలు

ఆవేశం



కోపాన్ని ప్రదర్శించే క్రమంలో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. చివరకు రక్తసంబంధీకులను కూడా లెక్కచేయకుండా ప్రాణం తీసే వరకు వెళ్తున్నారు. ఆవేశం, కోపం, అహం వంటివి వీడి ఎలాంటి సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించుకోవాలి. 'తన కోపమే తన శత్రువు' అనే మాట మరువరాదు.

★ ఘోరమైన నేరాలు : 1070



ఆరేళ్ల పైబడిన జనాభాలో లింగ నిష్పత్తి (1000 మంది పురుషులకు)
- నిజామాబాద్ : 1044
- కామారెడ్డి : 1033

ఆరేళ్లలోపు పిల్లల్లో
- నిజామాబాద్ 953
- కామారెడ్డి 941

సామాజిక అంశాలు..



లింగ వివక్ష

నవరాత్రులు అమ్మవారిని నిష్ఠతో పూజించిన సమాజం మనది. కానీ వ్యక్తిగత విషయానికి వస్తే అమ్మవారి స్వరూపంగా భావించే ఆడబిడ్డలపై వివక్ష కొనసాగుతోంది. అందుకు నిదర్శనమే జిల్లాలో ఇటీవల పెరుగుతున్న లింగ నిర్ధారణ కేసులు. కామారెడ్డి జిల్లాలో రెండు ఘటనలు పరిస్థితి తీవ్రతను చాటాయి. అమ్మవారి స్వరూపమైన ఆడబిడ్డల విషయంలో వివక్షను పారదోలాల్సిన అవసరముంది.

ధరాఘాతం



పండగ పూట కూరగాయల ధరలు సామాన్యుడికి ఇబ్బందిగా మారాయి. కూరగాయలు సహా నూనెగింజలు వంటివి సాగు చేసుకునే సామర్థ్యం పల్లె ప్రజలకు ఉంది. పట్టణాల్లోనూ మిద్దెసాగుతో కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చు. కానీ ఆ కోణంలో ఆలోచించకపోవడంతో అందరూ మార్కెట్‌పై ఆధారపడే సరికి ధరలు పెరుగుతున్నాయన్న వాదన ఉంది. ప్రతి ఒక్కరూ తమ ఇంటికి సరిపడా ఉత్పత్తి చేస్తే మేలు.

2022లో రెండు జిల్లాల్లో ఉత్పత్తి అయిన కూరగాయలు (మె.ట.)
- నిజామాబాద్ : 25,556
- కామారెడ్డి : 28,301

పర్యావరణం

అడవుల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, ఇసుక తోడేయడం, నదుల సహజత్వాన్ని దెబ్బతీయడం వంటి చర్యలతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. ఫలితంగా అతి వర్షాలు, వర్షాభావం, తీవ్ర ఎండలు వంటి అసహజ వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి.



★ ఇసుక చౌర్యం కేసులు : 3

వనరుల సంరక్షణ



మన పరిధిలో మనమే జల, సహజ వనరుల సంరక్షణకు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో వ్యవహరించాలి.

ఉమ్మడి జిల్లాలో చెరువులు : 3400

ట్రాఫిక్ నియమాలు



ట్రాఫిక్ నిబంధనలు పాటించండి అంటూ అధికారులు నిత్యం సూచిస్తుంటారు. అయినా మార్పు రావడం లేదు. ఈ దసరా నుంచి అయినా ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

★ రోడ్డు ప్రమాదాలు : 287

★ ఈ-చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు : 3,31,588

అక్రమాలు ఆపేదెవరు..?

- బల్దియాల్లో పట్టణ ప్రణాళిక విభాగం నిర్వీర్యం
- అరకొర సిబ్బందితో పర్యవేక్షణ గాలికి

ఈనాడు, నిజామాబాద్

మున్సిపాలిటీల పరిధిలో పార్కు స్థలాలు.. కాలనీల్లో రోడ్ల ఆక్రమణలు నిలువరించాలి. అనుమతి తీసుకొని చేపట్టే నిర్మాణాల్లోనూ అతిక్రమణలు లేకుండా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు వేయాలి. పురపాలికల్లో ఇంతటి కీలక విధులు కలిగిన పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కొరతతో నిర్వీర్యంగా మారిందనే విమర్శ ఎదుర్కొంటోంది. పైగా అరకొర ఉద్యోగులు రెండు, మూడుచోట్ల డిప్యుటేషన్లపై కొనసాగుతుండటంతో ఎక్కడా న్యాయం చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో నగర పాలక సంస్థతో పాటు బల్దియాల్లో అధ్వాన పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్‌లో 19కి నలుగురే..

నిజామాబాద్ నగరపాలకలో పునర్విభజనకు ముందు 50 డివిజన్లకు కేటాయించిన క్యాడర్ స్ట్రెంత్ 19. కానీ, కేవలం నలుగురే ఉద్యోగులున్నారు. తొమ్మిది గ్రామాల విలీనం తర్వాత 60 డివిజన్లయ్యాయి. పరిధి విస్తరించిన క్రమంలో నిర్మాణాలు, ఆక్రమణల గుర్తింపునకు పట్టణ ప్రణాళిక విభాగంలో పోస్టులు పెంచాలి. కానీ, పాత క్యాడర్ స్ట్రెంత్ మేరకైనా భర్తీ లేకపోవడంతో 80 వేలకు పైగా గృహాలున్న నగరంలో పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసేందుకు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సియర్స్ (టీపీబీవోలు) ఏడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఆరుగురికి ఇద్దరే ఉన్నారు. నుడా చీఫ్ ప్లానింగ్ అధికారి శ్యాం కార్పొరేషన్ ఇన్‌ఛార్జి డీసీపీగా కొనసాగుతున్నారు.

మిగతా చోట్లా అదే పరిస్థితి

జిల్లా కేంద్రమైన కామారెడ్డిలో ఆరుగురు ఉద్యోగులకు ఇద్దరే ఉన్నారు. ఏడు గ్రామాలు విలీనమై 49 వార్డులు అయ్యాయి. పరిధి పెరిగినా సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడింది. బోధన్‌లోనూ 8 పోస్టులకు ఇద్దరే ఉన్నారు. ఇక్కడి టీపీఎస్ ఆర్మూర్, భీమ్‌గల్‌లో రెండేసి రోజులు, బాన్సువాడలో ఒకరోజు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. మెదక్ మున్సిపాలిటీ టీపీఎస్ ఎల్లారెడ్డిలో వారంలో ఒకరోజు ఉంటారు.

ఇతర పనులకు కేటాయింపు

ప్రతి బల్దియాలో నెలలో 30 నుంచి 50 భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు వస్తుంటాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సింది పట్టణ ప్రణాళిక విభాగమే. ప్రభుత్వ జాగాల్లో అక్రమ నిర్మాణాలు, నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులు విచారించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వేలాదిగా వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో లక్ష్యం నిర్దేశించారు. డిజిటల్ సర్వే, నాలాలు, చెరువుల ఆక్రమణల గుర్తింపు విధులనూ కేటాయించారు. ఉన్న కొద్దిమంది రోజు చేయాల్సిన పనులకు భిన్నంగా ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో తీరిక లేకుండా ఉంటున్నారు.

ఇదేబాటలో ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలు

టీఎస్‌బీపాస్ అమల్లోకి వచ్చాక 2021 నుంచి నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలకు ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక తహసీల్దార్ నేతృత్వంలో టీపీవో, ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖల సహాయ ఇంజినీర్లు, అగ్నిమాపకశాఖ అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ బృందం వచ్చిన ఫిర్యాదులతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం ఫిర్యాదులను సైతం క్షేత్రస్థాయిలో విచారించి అక్రమాలు ఆపాలి. వివిధ శాఖల భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ బృందం సమన్వయంతో పనిచేయాలి. కానీ, ఆయా శాఖల విధుల్లో తీరికలేకుండా ఉండే అధికారులు.. అసలు ఎన్‌ఫోర్స్‌మెంటు విధుల ఊసెత్తడం లేదు. శాసనసభ ఎన్నికల తర్వాత సమావేశమై సమీక్షించిన దాఖలాలు లేవు.



పురపాలిక	రికార్డుల్లో ఇళ్లు	వార్డులు	పట్టణ ప్రణాళిక విభాగం పోస్టులు	ఖాళీలు
ని.నగరం	80,000	60	19	15
బోధన్	18,000	38	6	2
ఆర్మూర్	22,188	36	4	2
భీమ్‌గల్	5,760	12	పోస్టు లేదు	–
కామారెడ్డి	26,556	49	6	4
బాన్సువాడ	10,000	19	పోస్టు లేదు	–
ఎల్లారెడ్డి	5400	12	పోస్టు లేదు	–